# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 07-11-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- రాష్ట్రంలో విద్యుత్ వినియోగానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు.
- రాష్ట్రంలో 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఉచితంగా క్యాన్సర్ పరీక్షలు నిర్వహిస్తామని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు.
- గ్రామీణ వ్యవస్థ బలోపేతానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.
- దేశానికే డ్రోన్ హబ్ గా ఆంధ్రప్రదేశ్ ను తీర్చిదిద్దుతామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు.
- భారత్ క్రీడాకారిణి పి.వి.సింధు విశాఖలో బ్యాట్మింటన్ అకాడమీకి ఈరోజు శంకుస్థాపన చేశారు.

=========================

రాష్ట్రంలో విద్యుత్ వినియోగానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. గుంటూరు జిల్లా తాళ్లాయపాలెంలో రాష్ట్రంలోనే మొదటి గ్యాస్ ఇన్సులేటెడ్ ఉపకేంద్రాన్ని ఈరోజు ఆయన ప్రారంభించారు. అనంతరం దృశ్యమాధ్యమం ద్వారా పలు విద్యుత్ ఉపకేంద్రాలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో విద్యుత్ సంస్కరణలకు శ్రీకారం చుట్టామన్నారు. ట్రాన్స్మిషన్ నష్టాలు తగ్గించి తీసుకొచ్చిన విద్యుత్ సంస్కరణలు దేశానికి ఆదర్శంగా నిలిచాయని పేర్కొన్నారు. అలాగే ఆడవారిపై సామాజిక మధ్యమాలలో అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి హెచ్చరించారు. దీనికోసం అవసరమైన చట్టాలును తీసుకువస్తామని చంద్రబాబు నాయుడు తెలియజేశారు.

=========================

క్యాన్సర్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. ఈరోజు జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా సచివాలయంలో ఏర్పాటు చేసిన సమావేశం మంత్రి మాట్లాడుతూ.... 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఇంటి వద్దనే ఉచితంగా క్యాన్సర్ పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. క్యాన్సర్ పై అవగాహన కలిగి ఉండి లక్షణాలను గుర్తించి వెంటనే చికిత్స తీసుకుంటే క్యాన్సర్‌ను జయించవచ్చని అన్నారు. ప్రజలకు క్యాన్సర్ పట్ల అవగాహన కోసమే జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవాన్ని జరుపుకుంటున్నాని మంత్రి తెలిపారు.

========================

పంచాయతీలు స్వయం పోషక పంచాయితీలుగా ఎదగాలని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో సర్పంచ్ సంఘాల ప్రతినిధులతో ఈరోజు ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ... గ్రామీణ వ్యవస్థ బలోపేతానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. ఎంపీ నిధుల ద్వారా కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలు పూర్తి చేస్తున్నామన్నారు. 2014-19 కాలానికి సంబంధించి పెండింగ్ నిధుల విడుదలకు కేబినెట్‌లో ఆమోదం తెలిపామన్నారు. మరో నెల రోజులలో 750 కోట్ల రూపాయల నిధులు పంచాయతీలకు రాబోతున్నాయని వెల్లడించారు. వెదురు పెంపకం, బయో డీజిల్ మొక్కల పెంపకం ద్వారా పంచాయితీల ఆదాయ వృద్ధికి చర్యలు చేపడుతున్నామన్నారు. "జల్ జీవన్ మిషన్" ద్వారా ప్రతి గ్రామానికి తాగునీరు అందిస్తామని తెలిపారు. పంచాయతీరాజ్ వ్యవస్థలో అవినీతిని నిర్మూలించేలా చర్యలు తీసుకుంటామని పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ....

(వాయిస్ 30 సెకన్లు)

========================

దేశానికే డ్రోన్ హబ్ గా ఆంధ్రప్రదేశ్ ను తీర్చిదిద్దుతామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. గుంటూరు ఎన్ జీ రంగా విశ్వవిద్యాలయంలో నిర్వహించిన ఆచార్య ఎన్ జీ రంగాజయంతి ఉత్సవాల్లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్ జీ రంగా విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ, డ్రోన్ల వినియోగంతో వ్యవసాయ రంగం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. వ్యవసాయ క్షేత్రాల్లో డ్రోన్ల ద్వారా ఎరువులు, పురుగు మందుల పిచికారి తీరును పరిశీలించిన మంత్రి వ్యవసాయ విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న డ్రోన్ పైలెట్ లతో డ్రోన్ల పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు.

========================

దేవాదాయ శాఖలో ఖాళీగా ఉన్న 500 పోస్టులను త్వరలోనే భర్తీ చేయనున్నామని రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడిలోని దేవాదాయ శాఖ కమిషనర్ కార్యాలయంలో అధికారులతో ఈరోజు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... దేవాదాయ శాఖలో ఖాళీగా ఉన్న అర్చక విభాగం, పరిపాలనా విభాగంలో సిబ్బందిని నియమించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. వేదాధ్యయనం చేసి, ఉపాధి కోసం ఎదురు చూస్తున్న వేద పండితులకు, సంభావన పేరుతో నెలకు 3 వేల రూపాయలను ప్రభుత్వం అందించనుందని, ఈ పథకం కింద సుమారు 600 మందికి లబ్ధి చేకూరుతుందన్నారు. త్వరలో దేవాలయ ట్రస్టు బోర్డుల నియామకాలు చేపడతామన్నారు.

విరామం

========================

గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ఒలంపిక్స్ స్థాయికి తీసుకెళ్లాలన్నదే తన లక్ష్యమని భారత్ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పి.వి.సింధు అన్నారు. విశాఖలోని చినగదిలిలో 2 ఎకరాల స్థలంలో బ్యాట్మెంటన్ అకాడమీకి ఆమె ఈరోజు శంకుస్థాపన చేశారు. పి.వి సింధు సెంటర్ ఆఫ్ బ్యాడ్మింటన్ ఎక్సెలెన్సీగా ఈ అకాడమీకి నామకరణం చేశారు. ఈ సందర్భంగా పి.వి

సింధు మాట్లాడుతూ... ఒక సంవత్సరంలోగా అకాడమీని అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. గ్రీన్‌కో భాగస్వామ్యంతో, మాజీ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు పుల్లెల గోపీచంద్ సహాయంతో అకాడమీని విజవంతంగా నడిపిస్తానని ఆమె వివరిస్తూ.....

(వాయిస్ 27 సెకన్లు)

=========================

ఐటీ రంగంలో ప్రభుత్వం చేసిన కృషితో రాష్ట్ర విద్యార్థులు విదేశాలలో సైతం అద్భుతంగా రాణిస్తున్నారని రాష్ట్ర ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ అన్నారు. అమరావతిలోని విట్ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన అంతర్జాతీయ ఉన్నత విద్య ప్రదర్శన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... గెలవడం కోసం నిలబడాలన్న మాటను విద్యార్థులు గుర్తుపెట్టుకోవాలని, అంతర్జాతీయ పరిణామాలపై  అవగాహన కలిగి ఉండాలన్నారు.  రాబోయే 25 సంవత్సరాల్లో దేశం  మరింత అభివృద్ధి చెందుతుందని, “వికసిత్ భారత్.. వికసిత్ ఏపీ” నినాదంతో ముందుకెళ్తున్నామని మంత్రి లోకేష్ పేర్కొన్నారు.

=========================

బాల్యవివాహాల వల్ల జరిగే అనర్థాలు గూరించి ప్రజలు అవగాహన కలిగి ఉండాలని రాష్ట్ర మహిళ, శిశు సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శి ఎ.సూర్యకుమారి అన్నారు. బాలికల సంక్షేమంకోసం కేంద్ర ప్రభుత్వం రూపొందించిన కిషోరి వికాస్ పై గుంటూరులో నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ఆమె పాల్గొ న్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... బాల్యవివాహాలను నిర్మూలించేందుకు ఇటువంటి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. బాల్యవివాహాల పట్ల స్పందిస్తూ, ఫిర్యాదులు చేస్తున్న వారి సంఖ్య మన రాష్ట్రంలోనే ఎక్కువగా ఉందని, ఇది ప్రజలలో ఉన్న అవగాహనకు నిదర్శనమని ఆమె పేర్కొంటూ...

(వాయిస్ 28 సెకన్లు)

=========================

గ్రామస్తులు, ఏనుగుల భద్రతకు అవసరమైన అన్ని జాగ్రత్తలను తీసుకుంటున్నామని  పార్వతీపురం మన్యం జిల్లా అటవీ శాఖాధికారిణి జి.ఎ.పి. ప్రసూన తెలిపారు. ఈ మేరకు ఈరోజు ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. భామిని మండలం నల్లరాయగూడ గ్రామ సమీపంలో ఏనుగుల గుంపు సంచారాన్ని అటవీ శాఖ పరిశీలిస్తోందని అన్నారు. నల్లరాయగూడ పరిసర ప్రాంతాలలో అటువంటి పరిస్థితులలో తీసుకోవలసిన చర్యల గురించి గ్రామస్తులకు అవగాహన కల్పిస్తూ... అప్రమత్తం చేస్తున్నామన్నారు. వన్య ప్రాణులతో శాంతి యుత సహజీవనాన్ని నిర్ధారించడం తమ ప్రాధాన్యతని, ఈ సందేశాన్ని వ్యాప్తి చేయడంలో ప్రజలు సహకరించాలని కోరారు.

=========================

సేవా దృక్పథంతో జాతికి విశేష సేవలను అందిస్తున్న స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలను మరింత విస్తరించాలని విజయనగరం జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ పిలుపునిచ్చారు. కలెక్టర్ ఆడిటోరియంలో జరిగిన స్కౌట్స్ అండ్ గైడ్స్ 75 ఆవిర్భావ దినోత్సవ వేడుకలలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 8, 9, 10వ తరగతి విద్యార్థులను ఈ కార్యక్రమంలోనికి తీసుకురావాలని సూచించారు.  దశలవారీగా ప్రైవేటు పాఠశాలలకు కూడా విస్తరిస్తామని ప్రకటించారు. జిల్లాలో స్కౌట్స్, గైడ్స్ సేవలను విస్తరించేందుకు జిల్లా యంత్రాంగం తరపున సంపూర్ణ సహకారాన్ని అందిస్తామని కలెక్టర్ ప్రకటించారు.

=========================

రోడ్డు ప్రమాదాల నివారణకు రూపొందించిన ఐఆర్ఏడి (ఇంటిగ్రేటెడ్ రోడ్ యాక్సిడెంట్ డేటాబేస్)పై సిబ్బందికి అవగాహనా కార్యక్రమాన్ని పార్వతీపురం మన్యం జిల్లా ఆసుపత్రిలో ఈరోజు నిర్వహించారు.

==========================

==========================